క్లుప్తంగా

నేటి నుంచి ధనుర్మాస పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బొల్లవరంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసం సందర్భంగా రోజూ తిరుప్పావై పాశురాలను పఠించనున్నట్లు ఆలయ చైర్మన్ గోనా ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ సాయంత్రం 6 గంటలకు దేవతా మూర్తుల వాహన పల్లకి సేవ ఉంటుందని వివరించారు. 23న ముక్కోటి ఏకాదశి, జనవరి 1 స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణ, 14న ఉదయం అన్నమయ్య సంకీర్తనల ఆలాపనలు, 10.30 గంటలకు శ్రీగోదాదేవి శ్రీకృష్ణుల కళ్యాణోత్సవం, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు కిక్‌బాక్సింగ్ పోటీలు

బద్వేలు అర్బన్ : బద్వేలులోని ఏవీఆర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ కిక్‌బాక్సింగ్ ఆర్గనైజేషన్ (వాకో) ఆధ్వర్యంలో అంతర్ జిల్లా కిక్‌బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ జె.వెంకటసుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలను ఆర్డీఓ ఆకుల వెంకటరమణ, మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళరాజగోపాల్‌రెడ్డి తదితరులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

నూతన నియామకం



మాట్లాడుతున్న పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నాగార్జున ఐటీఐ కళాశాలలో శనివారం పీఎస్‌వైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్‌గా ఓబులేసు, కడప ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా బయన్న, జిల్లా అధ్యక్షుడుగా శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా చిన్న, రమేష్, మౌలాలి, పవన్, చంటి, పుల్లయ్య, కళ్యాణ్, ప్రతాప్, రాయుడు, చంద్ర, శరత్ తదితరులను ఎన్నుకున్నారు. విద్యారంగ, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. రాయలసీమ పరిరక్షణ సమితి నాయకుడు ప్రతాప్‌రెడ్డి, ప్రజా సంఘాల నాయకుడు గడ్డం నరసింహులు పాల్గొన్నారు.


వృద్ధులకు దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

కలసపాడు : మండలంలోని చెన్నారెడ్డిపల్లెలో ఆర్సీఎం చర్చి విచారణ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 70 మంది వృద్ధులకు పోరుమామిళ్ళలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తాతోమాస్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సంస్థ ప్రతినిధులు జి.శ్రీకాంత్‌రెడ్డి, ఎల్.ప్రసాద్‌రెడ్డి శనివారం ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఎఫ్‌సీఎన్ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమలు చేస్తున్నామని, వాటిలో భాగంగా పండుగ సమయాలలో వృద్ధులకు కొంత చేయూతనివ్వాలనే ఉద్దేశంతో ఈ దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. దుస్తులు పంపిణీ చేసినందుకు విచారణ గురువులు రెవ.ఫాదర్ జి.చిన్నప్ప, విచారణలోని గ్రామాల నుంచి వచ్చిన పెద్దలు, వృద్ధులు సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పార్టీ బలోపేతానికి కృషి



పార్టీ సభ్యత్వ కార్డులతో కార్యకర్తలు

పోరుమామిళ్ల : సమ సమాజ నిర్మాణం కోసం ఏర్పడ్డ భారత కమ్యూనిస్టు పార్టీ పోరుమామిళ్ల ప్రాంతంలో బలోపేతం కావాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ పేర్కొన్నారు. శనివారం తిరుపతిరెడ్డి కాలనీలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోవు ఎన్నికల దృష్ట్యా గ్రామ గ్రామాన పార్టీ విస్తరించాలన్నారు. అందుకు కార్యకర్తలు విస్తృతంగా పర్యటించి, పార్టీ పోరాటాలు, ఉద్యమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం 50 మందికి పార్టీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి పిడుగు మస్తాన్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి చంద్రమోహన్‌రాజు, నాయకులు రవికుమార్, బెల్లంబాషా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సోమేశ్వరుడి సన్నిధిలో న్యాయమూర్తులు

కడప కల్చరల్ : కడప నగరం దేవునికడపలోని శ్రీ సోమేశ్వరస్వామిని శనివారం ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి భానుమతి దర్శించుకున్నారు. జిల్లా జడ్జి జి.శ్రీదేవి, రెండవ అదనపు జిల్లా జడ్జి భార్గవిలతో కలిసి వచ్చిన ఆమెకు ఆలయ నిర్వాహకులు ఎ.శ్రీధర్, అర్చక బృందం సంప్రదాయ స్వాగతం పలికారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇడమడక గ్రామంలో శనివారం రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతో పాదర్శకంగా పాలన సాగుతోందని, ప్రజల వద్దకే పరిపాలన అందిస్తున్నామన్నారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని త్వరగా పరిష్కరిస్తున్నామన్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామాల్లోనే 40 రకాల వ్యాధులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందిస్తున్నామన్నారు. పేదలు ఇబ్బంది పడకూడదని వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వచ్చే నెల నుంచి రూ.3వేలు పింఛన్ ఇస్తామని, దేశంలో ఏ రాష్ట్రంలో ఇంత మొత్తంలో పింఛన్ ఇవ్వడం లేదన్నారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు హయాంలో పేదలకు ఎవరికి ఒక సెంట్ స్థలం కూడా ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం వ్యవస్థలను విచ్ఛిన్నం చేసిందని విమర్శించారు. చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ కూడా నెరవేర్చలేదన్నారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని చేతకాని హామీలను ఇచ్చిన మరోసారి మోసం చేయాలని చూస్తున్నారన్నారు. మీ కుటుంబానికి, మీ గ్రామానికి ఎవరు మేలు చేశారో వారినే ఆదరించాలన్నారు. అనంతరం నారాయణపల్లె, బయనపల్లె గ్రామాలకు చెందిన 16 మంది మహిళలకు ఇంటి పట్టాలు అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కానాల ఓబుళరెడ్డి, తహసీల్దార్ రమకుమారి, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, డాక్టర్ సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోగటం వీరారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నగరి శ్రీకాంత్, గుద్రాల రామమునిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

జగన్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

మైదుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని సోషల్ మీడియా ప్రతినిధులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. శనివారం మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయన్నారు. చంద్రబాబు లాగా వైఎస్ జగన్ ప్రజలను మోసగించలేదని, అబద్ధాలు చెప్పలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాడమే కాక చెప్పని వెన్నో చేశారని పేర్కొన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని, బంగారాన్ని విడిపిస్తామని, ఆడ పిల్ల పుడితే రూ.30వేలు బ్యాంకులో వేస్తామని, రైతులకు రుణమాఫీ చేస్తామని చంద్రబాబు వాగ్దానం చేసి వాటిని నెరవేర్చకుండా మోసం చేశారని ఎమ్మెల్యే ఆరోపించారు. వైఎస్ జగన్ డ్వాక్రా మహిళల రుణాలను వడ్డీతో సహాయ తిరిగి చెల్లించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రతి ఇంటికి రూ.లక్ష నుంచి రూ.4లక్షలు సాయం అందిందన్నారు. దీనిపై మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రజల సొమ్మును పప్పు బొరుగుల్లా పంచుతున్నామని విమర్శలు చేయడం శోచనీయమన్నారు. చంద్రబాబు లాగా జన్మభూమి కమిటీలకు పంచలేదని తెలిపారు. సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు వివేక్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయం తక్కువగా ఉందని, సోషల్ మీడియా చురుగ్గా పనిచేయాలని అన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేశారని, ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. వాటిని చిన్న చిన్న వీడియోలుగా చేసి ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. చంద్రబాబు ఎల్లో మీడియా అండదండలు ఉన్నాయని, అవి చేసే తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలన్నారు. శెట్టిపల్లె నాగిరెడ్డి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో సోషల్ మీడియా పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఎంతో కృషి చేసిందని తెలిపారు. సమావేశంలో వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు మదీనా దస్తగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ గూడూరు మహమ్మద్ దస్తగిరి పాల్గొన్నారు.

రూ.5 కోట్ల పనులకు ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో రూ.5 కోట్ల పనులకు ఆమోదం తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యతన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి , మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కౌన్సిలర్ల కోరిక మేరకు దాదాపు రూ.5కోట్ల విలువైన పనులకు ఆమోదం తెలిపేందుకే కౌన్సిల్ సమావేశం నిర్వహించామని తెలిపారు. ఈనెల 30న జరిగే కౌన్సిల్ సమావేశంలో మరో రూ.4కోట్ల పనులను అజెండాలో చేర్చుతామన్నారు. కౌన్సిల్ సభ్యులు పనులు త్వరగా చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కౌన్సిలర్లు అడిగిన మేరకు రోడ్లు, కాలువ పనులను వెంటనే మంజూరు చేస్తున్నామన్నారు. రూ.5 లక్షలు వరకు ఉన్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వ్యయాన్ని ప్రభుత్వం రూ.25 లక్షలకు పెంచిందని వైద్యాధికారి డాక్టర్ శివప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈనెల 20వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తామన్నారు.

- తమ వార్డులో వీధి లైట్లు వేయాలని 23వ వార్డు కౌన్సిలర్ వద్ద ఖలీల్ కోరారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్లు విద్యార్థులకు ఎంతో ప్రేరణ



సైన్స్ నమూనా ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈఓ-2 నరహరిశర్మ, హెచ్ఎం రమాదేవి



కాశినాయన : సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మైదుకూరు : విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టే సైన్స్ ఫెయిర్లు ఎంతో ప్రేరణ కలిగిస్తాయని మైదుకూరు ఎంఈఓ-2 నరహరిశర్మ, జెడ్పీ బాలుర హైస్కూల్ హెచ్ఎం ఎం.రమాదేవి అన్నారు. శనివారం మైదుకూరు జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఇందులో మండలంలోని ప్రభుత్వ హైస్కూళ్లు, కస్తూర్బా, గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 నరహరిశర్మ, హెచ్ఎం రమాదేవి మాట్లాడుతూ భవిష్యత్తులో శాస్త్రవేత్తలు కాగోరే విద్యార్థులకు సైన్స్ ఫెయిర్లు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ఇందులో పాల్గొనడం విద్యార్థులకు ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు.

విజేతలు వీరే : మండల స్థాయిలో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో వ్యక్తిగత విభాగంలో మైదుకూరు జెడ్పీ బాలికల హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని పి.నజీమా ప్రదర్శించిన 'సీజనల్ డిసీజెస్ డ్రగ్లెస్ థెరపీ' అనే సైన్స్ నమూనా జిల్లా స్థాయికి ఎంపికైంది. గ్రూపు విభాగంలో జెడ్పీ బాలుర హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఎస్.రోహన్ కుమార్, డీవీవీ సుధీర్ రూపొందించిన సైన్స్ నమూనా 'స్మార్ట్ ఇరిగేషన్ సిస్టం'ఎంపికైంది. టీచర్స్ కేటగిరిలో మండలంలోని లెక్కలవారిపల్లె జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయిని ఎం.అరుణకుమారి ప్రదర్శించిన 'విజిటేటివ్ ప్రోపాగేషన్ ఫ్రమ్ లోటస్ లీవ్స్' అనే సైన్స్ నమూనా జిల్లా స్థాయి పోటీకి ఎంపికైంది. చాపాడు మండలం సీబీఐటీలో ఈనెల 19న జరిగే జిల్లా సైన్స్ ఫెయిర్ పోటీల్లో ఈ మూడు నమూనాలను ప్రదర్శిస్తారని ఎంఈఓ-2 నరహరి శర్మ తెలిపారు.

సైన్స్‌ఫేర్‌కు విశేష స్పందన

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్‌ఫేర్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారి నిర్మల ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు అన్ని పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. అన్ని విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని పరిమళజ్యోతి ప్రాజెక్టు మ్యూజికల్ సైన్స్‌లో ప్రతిభ చాటారు. వ్యక్తిగత విభాగంలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు గురుమణికంఠ, శ్యామ్‌కుమార్, నవీన్‌కుమార్‌లు ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు పొందేందుకు వెసులుబాటు

దువ్వూరు : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని రేషన్ కార్డుదారులందరికి రేషన్ పొందేందుకు మరింత వెసులుబాటు కల్పించినట్లు తహసీల్దార్ రమకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నారని, వివిధ కారణాల వల్ల రేషన్ పొందలేని వారు ప్రతి నెల 17వ తేదీన వారి పరిధిలోని సచివాలయం వద్ద ఎండీయూ వాహనాలు ఉంటాయని అక్కడికెళ్లి రేషన్ తీసుకోవాలన్నారు. అవకాశాన్ని కార్డుదారులు వినియోగించుకోవాలని కోరారు.

వేతనాలు చెల్లించాలి

ప్రొద్దుటూరు : క్లాప్ డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని శనివారం పట్టణంలోని విజయకుమార్ సర్కిల్ నుంచి రాజీవ్ సర్కిల్ వరకు ఏపీ క్లాప్ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. క్లాప్ డ్రైవర్లు నాలుగు రోజులుగా ఆటోలను ఆపి, విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ మున్సిపల్‌లో 37 మంది క్లాప్ డ్రైవర్లకు వేతనాలు చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ పట్టణ కార్యదర్శి సాల్మన్, క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు.

26 నుంచి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలు

చాపాడు : మండల వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఈ నెల 15 నుంచి నిర్వహించాల్సిన పోటీలను ప్రభుత్వం మార్పు చేసి ఈ నెల 26 నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకున్న క్రీడా కారులందరూ క్రీడా పోటీలలో పాల్గొనాలని ఎంపీడీఓ పిలుపునిచ్చారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని అశోక్‌నగర్ సచివాలయం పరిధిలో శనివారం ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. సచివాలయం పరిధిలోని ఆయా కుటుంబాలకు గడిచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో చేకూరిన లబ్ధిని తెలిపే బోర్డును ప్రదర్శించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ గడిచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో సచివాలయ పరిధిలోని కుటుంబాలకు ప్రత్యక్ష నగదు బదిలీ కింద రూ.7.05 కోట్లు, పరోక్ష ప్రయోజనాల కింద రూ.5.28 కోట్లు చొప్పున మొత్తం రూ.12.33 కోట్లు నిధులు జమ చేయడం జరిగిందని తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాబోవు ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. అలాగే గాంధ్లవీధి సచివాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని తెలిపే బోర్డును ఆవిష్కరించారు. ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే అనే బుక్‌లెట్‌లను విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాశ్రీరాములు, వైవీయూ పాలక మండలి సభ్యులు కొండపల్లి చిన్నసుబ్బారావు, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గోపాలస్వామి, ఆర్.వి. సాయిక్రిష్ణ, కౌన్సిలర్లు చక్రపాణిఉమ, అనిల్, శ్రీనివాస్‌యాదవ్, ప్రతాప్‌కుమార్, కేశవరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, రమేష్‌బాబు, రాజేష్, మౌలాలి, ఖాజా, రజనీకాంత్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ పబ్బతిచంద్రశేఖర్, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు, మున్సిపల్ అధికారులు, గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బద్రిపల్లెలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ప్రజలు, అధికారులు

చాపాడు : మండలంలోని బద్రిపల్లెలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేందుకు సంచార వాహనంపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకూ ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించటం జరుగుతుందని తెలియజేశారు. గ్రామ సర్పంచ్ మల్లేశ్వరి, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, మండల వైద్యాధికారి రాజేష్ కుమార్, మండల వ్యవసాయాధికారి మ్యాగీ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ సుబ్బరాయుడు, మండల ఇన్‌చార్జీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సైనికోద్యోగులు, ఎన్‌సీసీ విద్యార్థులు

బద్వేలు అర్బన్ : దేశరక్షణకు అమలవీరులు అందించిన త్యాగం మరువలేనిదని విశ్రాంత సైనికోద్యోగుల సంఘం అధ్యక్షులు కోనేటి రామకృష్ణయ్య, ఉపాధ్యక్షులు పెంచలయ్య పేర్కొన్నారు. విజయ్ దివస్‌ను పురస్కరించుకుని శనివారం స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని అమరవీరుల స్తూపం వద్ద మాజీ సైనికోద్యోగుల సంఘం, రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో భారతదేశం విజయం సాధించడంతోపాటు, డిసెంబర్ 16న పాకిస్తాన్ సైన్యం భారతదేశానికి లొంగిపోయిందని, ఆ తేదీని భారత ప్రభుత్వం విజయ్‌దివస్‌గా ప్రకటించి ప్రతి ఏటా అమరవీరులను స్మరించుకోవడం జరుగుతోందన్నారు. దేశ సరిహద్దుల్లో ఎంతో మంది సైనికులు ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తుండడంతోనే మనమంతా స్వేచ్ఛగా జీవించగలుగుతున్నామన్నారు. అటువంటి మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు, యువత ఆత్మవిశ్వాసం పెంపొందించుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. తొలుత పట్టణంలో ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సైనికోద్యోగుల సంఘం నాయకులు, కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎన్‌సీసీ ఏఎన్‌ఓలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నడింపల్లె వీధికి చెందిన డి.హుసేన్‌బీ, ముస్తఫాల కుమారుడు డి.తాహీర్ జాతీయస్థాయి అండర్-14 ఎస్జీఎఫ్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల నంద్యాలలో ఎస్పీజీ గ్రౌండ్‌లో జరిగిన 67వ రాష్ట్రస్థాయి బాలుర అండర్ -14 క్రికెట్ పోటీల్లో ప్రతిభభ కనపరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జనవరిలో కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ విద్యార్థి విస్డమ్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. తమ పాఠశాల విద్యార్థి జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికవడం పట్ల పాఠశాల యాజమాన్యం షామీర్, బాబుబాషా, యూసఫ్, కరీముల్లా, కోచ్ అహ్మద్‌బాషా, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

చెస్ ఆడితే ఏకాగ్రత పెరుగుతుంది



మాట్లాడుతున్న వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాగరాజు

ప్రొద్దుటూరు : చెస్ ఆడితే ఏకాగ్రత పెరుగుతుందని వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.నాగరాజు పేర్కొన్నారు. శనివారం యోగివేమన యూనివర్సిటీ అంతర్ కళాశాల చెస్ పోటీలు వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ ఆడటం వలన ఏకాగ్రత పెరగడంతో మెంటల్ ఎబిలిటి అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మెదడును చురుకుగా ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. యోగివేమన యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చెస్ ఆడటం వల్ల ఉపయోగం ఉంటుందన్నారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ కేవీ రమణయ్య మాట్లాడుతూ తమ కళాశాలలో ముమ్ముందు మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో వివిధ కళాశాలలకు చెందిన 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సివిల్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ జయరామిరెడ్డి, మెకానికల్ హెచ్‌ఓడీ జయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఏఐటీయూసీ, సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలు పెంచాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, యూనియన్ల నాయకురాళ్లు లక్ష్మీదేవి, సుబ్బలక్ష్మి, రాణి, సువార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

చాపాడులో..

చాపాడు : మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద శనివారం నాలుగో రోజు అంగన్‌వాడీ వర్కర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్ అంగన్‌వాడీ వర్కర్లకు మద్దతు తెలిపారు. ఆయనతో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

మైదుకూరు : మైదుకూరులో శనివారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హోటళ్లపై దాడి చేసి గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న మాషా అల్లా హోటల్ నుంచి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 5 గృహ అవసర సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. హోటల్ యజమానిపై నిత్యావసర సరుకుల చట్టం, 1955 మేరకు 6(ఏ) కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ టి.రెడ్డప్ప మాట్లాడుతూ హోటల్ యజమానులందరూ వారి వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాడరాదని, కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను మాత్రమే విధిగా వాడాలన్నారు. లేదంటే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలలో మహేంద్రారెడ్డి, జనార్ధన్‌రావు, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.